ప్రతినెలా సివిల్ రైట్స్‌డేను నిర్వహించాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నల్లగొండ, మార్చి 11: షెడ్యూల్డ్ కులాలు, తెగల వారిపై దాడుల నివారణ, అంటరానితనంపై అవగాహనకు గ్రామాల్లో ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్‌డేను తప్పనిసరిగా నిర్వహించాలని, మూడు నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం నల్లగొండకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో కమిషన్ సభ్యులతో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, వాటికి సంబంధించిన కేసులపై సమీక్షించారు. ఎస్సీల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ భూములకు సంబంధించి 9 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై మార్చి31లోగా నివేదిక పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దాడుల విషయంలో పెండింగ్‌లో ఉన్న 17 కేసులకు సంబంధించి నివేదికలు పంపించాలని ఎస్పీ శరత్ చంద్రను ఆదేశించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఇప్పటికే 12కేసులకు సంబంధించిన నివేదికలు పంపించామని, త్వరలో మిగిలినవి పంపిస్తామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజన్సీల విషయంలో ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించాలని, సబ్‌ప్లాన్ విషయంలో ఎవరైన లక్ష్మణ రేఖ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కలెక్టర్ ఇలా త్రిపాఠి వివరించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, కుప్రం నీలాదేవి, ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్, ఏఎస్పీ మౌనిక, డీడీలు కోటేశ్వర్ రావు, రాజ్‌కుమార్, దళిత సంఘం ప్రతినిదులు మహేందర్, నాగార్జున పాల్గొన్నారు.

అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం చేయాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, వేదికపై కలెక్టర్, ఎస్పీ

సూర్యాపేట, మార్చి 11 : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల భూములపై కేసులు ఉంటే త్వరగా పరిష్కరించాలని, వారికి పీఎం అజయ్ పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఆ భూముల్లో బోర్లు వేసి నీటి వసతి కల్పించాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత బంధు రాని అర్హులైన 8 కుటుంబాలకు వెంటనే అందేలా చూడాలన్నారు. మాలబంటి ఆలియాస్ కృష్ణ కేసు త్వరగా పూర్తి అయ్యేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని, అతడి భార్య భార్గవికి ఉద్యోగం, ఇల్లు, పింఛన్, భద్రత, వ్యవసాయ భూమి అందించాలన్నారు. ప్రతి నెల చివరన పౌర హక్కుల దినోత్సవం జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శాఖల వారీగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు నీలా దేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రాములునాయక్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా అధికారులు లత, శంకర్, శ్రీనివాస్‌నాయక్, బాపూజీ, సీతారాం పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

జిల్లాలో శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పీపీటీ ద్వారా చక్కగా వివరించి, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ వారికి అండగా నిలువడం పట్ల అభినందిస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సన్మానించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

● రూ.లక్ష విలువైన గంజాయి స్వాధీనం

సూర్యాపేట టౌన్, మార్చి 11 : గంజాయి రవాణా, వినియోగం కేసులో ఐదుగురిని అరెస్టు చేయగా ఇద్దరు పరారీలో ఉన్నారు. వారి నుంచి రూ లక్ష విలువైన 9.860 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం కేసు వివరాలను ఎస్పీ కె.నరసింహ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాకు చెందిన మల్లెడ వెంకట వంశీ, గోకులముడి ఆనంద్ ఆంధ్ర, ఒడిశా బార్డర్ నుంచి గంజాయి తక్కువ ధరకు తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి వాటిని హైదరాబాద్‌లో అమ్ముతున్నారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లా పెనుమూరు మండలానికి చెందిన చోరగుడి తేజతో కలిసి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తూ మార్గమధ్యంలో కోదాడ శివారులోని దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద బస్సు దిగారు. రోడ్డు పక్కన మామిడితోటలోకి వెళ్లి సంపత్, హేమన్ నర్సింహసాయి, కృష్ణ చైతన్య, భాస్కర్‌కు గంజాయి ఇస్తుండగా నమ్మదగిన సమాచారంతో ఈ నెల 10న కోదాడ పట్టణ ఎస్ఐ సైదులు పట్టుకున్నారు. ఈ కేసులో మల్లెడ వెంకటంశీ, గోకులముడి ఆనంద్ పరారీలు ఉండగా చొరగుడి తేజ, ఉమ్మడిశెట్టి సంపత్‌కుమార్, పాలపర్తి కృష్ణ చైతన్య, ఖాజా నాగమీర భాస్కర్‌రావు, ఈడే హేమన్ నర్సింహసాయిను అరెస్టు చేశారు. రూ లక్ష విలువైన గం జాయితోపాటు రూ. 60వేల విలువైన ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకున్న కోదాడ ఎస్ఐ ఎస్.కె. సైదులు, ఎస్ఐ లింగయ్య, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, వి.రామారావు, కానిస్టేబుళ్లు సతీశ్‌నాయుడు, ఎల్లారెడ్డి, ఎస్.కె. ఫరీద్, శివకుమార్, నాగేంద్రబాబు, పర్యవేక్షణ చేసిన సీఐ టి.రామును ఎస్పీ అభినందించారు.

ఎండిన పాలాలను కలెక్టర్ పరిశీలన

భక్తళాపురంలో ఎండిన పంట పరిశీలిస్తున్న కలెక్టర్ నందలాల్

పెన్‌పహాడ్, మార్చి 11 : మండల పరిధిలోని మెఘ్యా తండా, భక్తళాపురం, ధర్మాపురం గ్రామాల్లో ఎండిపోతున్న పొలాలు, ఎస్సారెస్పీ కాల్వలను మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భూక్యా క్రాంతికి చెందిన పొలంలోకి దిగి పంటను పరిశీలించారు. సాగు నీరు, బోరు బావుల ద్వారా వరిపొలం ఎంత సాగు చేయొచ్చని కలెక్టర్ ఆరా తీశారు. ఇంకా ఎన్ని రోజులు నీళ్లు సరఫరా చేస్తే పంట చేతికి వస్తుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా 20రోజులు నీరు ఇస్తే ఆయకట్టు చివరి పొలాలు చేతికొచ్చే పరిస్థితి ఉంటుందని రైతులు కలెక్టర్‌తో వాపోయారు. కార్యక్రమంలో తాసీల్దార్ ధరావత్ లాలూనాయక్, ఇరిగేషన్ ఏఈ లింగయ్య, ఏఓ అనిల్‌నాయక్, ఆర్ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తూము ధ్వంసం.. నీరు వృథా

చెరువు తూమును ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న నీరు

ఆత్మకూర్.ఎస్, మార్చి 11 : మండలంలోని ఏపూరు శుభసముద్రం చెరువు తూముకు ఉన్న తలుపుల ఇనుప ప్లేట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో గత ఐదు రోజులుగా నీరు వృథా అవుతున్నదని స్థానిక రైతులు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఓ వైపు గోదావరి జలాలు సక్రమంగా అందక, చెరువుల్లో నీళ్లు లేక సాగునీటితో పాటు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో చెరువులో ఉన్న కొద్దిపాటి నీటితోనైనా భూగర్భ జలాలు ఉంటాయనుకుంటే అవి కూడా వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అధికారులు స్పందించి తూమును వెంటనే మూసి వేయాలని, లేదంటే రెండ్రోజుల్లో చెరువు మొత్తం ఖాళీ అవుతుందన్నారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వానిదే బాధ్యత : ఏఐఎస్ఎఫ్

నేరేడుచర్ల, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో 83 మంది విద్యార్థులు గురుకులాల్లో మృతి చెందారని దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు కొమర్రాజు వెంకట్ అన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో రాష్ట్రంలోని విద్యాసంస్థలు, గురుకులాలపై పర్యవేక్షణ లేక విద్యార్థుల ప్రాణాలు పోతున్నాయని విమర్శించారు.

హామీలను అమలు చేయాలి : శ్రీనివాస్

గరిడేపల్లి, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రైతు సంఘం మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మండల రైతు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఎం

పెన్‌పహాడ్, మార్చి 11 : శ్రీరామ్‌సాగర్ ఆయకట్టు కింద ఉన్న పెన్‌పహాడ్, మునగాల, చివ్వెంల మండలాల పరిధిలోని గ్రామాల రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోయారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని తుల్జారావ్‌పేట గ్రామంలో మంగళవారం ఎండిపోయిన వరి పొలాలను బాధిత రైతులతో కలసి పరిశీలించి మాట్లాడారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.30వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నడిగూడెం : ఎండిన పంటలు ఎకరాకు ప్రభుత్వం రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని కరివిరాల గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వెంకటేశ్వర్లు, మస్తాన్, భద్రయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో చేతివాటం!

● చనిపోయిన వ్యక్తి పింఛన్ కాజేసిన వైనం

మేళ్లచెర్వు, మార్చి 11 : ఏడాదిన్నర క్రితం మృతి చెందిన వ్యక్తి పింఛన్‌ను పోస్టల్ సిబ్బంది చేతివాటంతో కాజేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రానికి చెందిన ఎస్. కుమార్ అనే వ్యక్తి 2023 సెప్టెంబర్‌లో మృతి చెందాడు. కానీ అతడి పింఛన్‌ను తొలగించకుండా చేతివాటం ప్రదర్శిస్తూ పోస్టల్ సిబ్బంది ఖాజేస్తున్నారు. ఇటీవల పంచాయతీ సిబ్బంది రికార్డుల పరిశీలనలో కుమార్ మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం చివరికి పెద్ద మనుషుల దగ్గరకు చేరినట్లు సమాచారం. ఈ విషయమై పోస్టుమాస్టర్‌ను వివరణ కోరగా..పింఛన్ల పంపిణీ తరువాత మిగిలిన డబ్బులు మాత్రం తమకు అప్పగిస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి ఫరీద్ మాట్లాడుతూ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే రికవరీకి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్ సర్కారుతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధం : ఎమ్మార్పీఎస్

సూర్యాపేట టౌన్ : దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 11 : రేవంత్‌రెడ్డి సర్కారుతో తాడోపేడో తేల్చుకోవడానికి ఎమ్మార్పీఎస్ సిద్ధమైందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు, జిల్లా నాయకులు వల్దాస్ జాని అన్నారు. వర్గీకరణ అయ్యే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9నుంచి చేపట్టిన నిరవధిక దీక్ష మంగళవారం మూడోరోజుకు చేరగా వారు హాజరై మాట్లాడారు. దీక్షలో చింతలపాటి చినశ్రీరాములు, బోడ శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, ముల్కలపల్లి రవి, బొడ్డు విజయ్, గంట భిక్షపతి, మేడి కృష్ణ పాల్గొన్నారు.

మాదిగ జాతి ద్రోహి సీఎం రేవంత్ : కృష్ణ

ఆత్మకూర్.ఎస్ : మాదిగ జాతి ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు మేడి కృష్ణ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టం అయ్యే వరకు ప్రభుత్వ ఉద్యోగ ఫలితాలను వాయిదా వేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారం మూడోరోజుకు చేరాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముల్కలపల్లి రవి, మండల అధికారి ప్రతినిధి మిర్యాల చిన్ని, పల్లెల రాములు, మహేశ్, శ్రవణ్, ఎలేందర్, శేఖర్, చింటు, రాకేశ్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌పై 25శాతం రాయితీని ప్రచారం చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, మార్చి11: రాష్ట్ర ప్రభుత్వం పాట్ల రెగ్యులరైజేషన్‌కు ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్‌ను చెల్లించిని వారికి 25 శాతం రాయితీ ఇస్తున్న విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్లగొండ మున్సిపల్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌పై లైసెన్స్ టెక్నికల్ ప్లానర్లు, లేఔట్ ఓనర్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ రైటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉదయ సముద్రం పరిశీలన

నల్లగొండ రూరల్ : జిల్లాలో ఆయా ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు నీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మంత్రుల ఆదేశాల మేరకు పానగల్ సమీపంలోని ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి సందర్శించారు. ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలో ఉన్న 67వేల ఎకరాలకు వారబందీ ప్రకారం పంట కోతకు వచ్చే వరకు నీటిని అందిస్తామన్నారు. ఆమె వెంట డీఏఓ శ్రవణ్, ఉదయ సముద్రం ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఎంజీయూలో గోల్డ్‌మెడల్స్ కోసం రూ.10లక్షల విరాళం

రామగిరి, మార్చి 11: తెలుగు భాషలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంజీయూలో అందించే గోల్డ్‌మెడల్స్ కోసం రిటైర్డ్ ప్రొఫెసర్లు మంగళవారం రూ. 10లక్షల విరాళాన్ని అందించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు ఇంద్రసేనారెడ్డి, ఎం.ఇంద్రారెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, కె.లింగారెడ్డి, కె.విజయందర్‌రెడ్డి దీనిని వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీటిలో బంగారు పతకాలకు రూ. 3 లక్షలు, రూ. 6లక్షలు ప్రతి సంవత్సరం విద్యార్థులకు నిపుణులతో ఏర్పాటు చేసే స్మారక ఉపన్యాసాలకు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఎంజీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేందర్‌రెడ్డి, కామర్స్ అండ్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ మారం వెంకటరమణారెడ్డి, స్పోర్ట్స్‌బోర్డు డైరెక్టర్ హరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

పైప్‌లైన్‌వద్ద గుంతను పూడ్చిన అధికారులు

దామరచర్ల, మార్చి 11: మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారి వెంట పైపులైన్ లీకేజీని మంగళవారం అధికారులు సరిచేశారు. లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్న వైనంపై ఈనెల 9న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'ముంచుకొస్తున్న ముప్పు-కలుగదా కనువిప్పు' కథనానికి అధికారులు స్పందించి స్థానిక సిబ్బందితో కలిసి లీకేజీని సరిచేసి గుంతను పూడ్చివేశారు. దాంతో గ్రామస్తులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

దామరచర్ల, మార్చి 11: మండలంలోని కొండ్రపోల్ గ్రామానికి చెందిన కుంకునూరి నర్సింహారావు(70) మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. నర్సింహారావు ఉదయం నార్కట్‌పల్లి-అద్దంకి రోడ్డు వెంట వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అకక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

31 వరకు ఎల్ ఆర్ఎస్ గడువు

నకిరేకల్/మిర్యాలగూడటౌన్, మార్చి 11 : 2020లో రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులకు, అనుమతిలేని లేఅవుట్లలో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు 25 శాతం ఫీజు రాయితీతో ఈ నెల 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని నకిరేకల్ , మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్లు డి. బాలయ్య, ఎండీ.యూసుఫ్ తెలిపారు, అనుమతి లేని లేఅవుట్లలో రిజిస్ట్రేషన్ కాని వాటిని కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌తో పాటు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ బలరాం, అధికారులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు మంత్రి ఉత్తమ్ నివాళి

హుజూర్‌నగర్, మార్చి 11 : పట్టణంలోని 11వ వార్డు మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కస్తాల శ్రవణ్ కుమార్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంగళవారం శ్రవణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రవణ్ కుమార్ అంతిమయాత్రలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఒలింపియాడ్‌లో సాన్వికకు జాతీయ స్థాయి ర్యాంకు

హుజూర్‌నగర్, మార్చి 11 : పట్టణానికి చెందిన సాన్విక ప్రజ్ఞకు ఎయిమ్స్ ఒలింపియాడ్ హంట్ 2024-25 సంవత్సరానికి గానూ జాతీయ స్థాయిలో గణితం, సైన్స్ అంశాలపై నిర్వహించిన టాలెంట్ సెర్చ్ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు రవీంద్ర భారతిలో చిన్నారికి పశంసా పత్రాన్ని అందించారు.

గౌడ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : బచ్చయ్యగౌడ్

నూతనకల్, మార్చి 11 : ప్రభుత్వం ఎన్నికల్లో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే రిలీజ్ చేసి ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమి ఇచ్చి ఈత, తాటి చెట్లను పెంచాలని డిమాండ్ చేశారు.

'అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేయాలి'

మోతె, మార్చి 11 : మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న 15 అంగన్‌వాడీ భవనాలకు బడ్జెట్ కేటాయించి పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోతె మండలం రాఘవాపురం గ్రామంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రజా పోరు యాత్రను ప్రారంభించి మాట్లాడారు. సుమారు 40 శాతం పనులు అయినప్పటికీ బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారన్నారు. నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్‌కు బీపీ, వేయింగ్ మిషన్ల అందజేత

నేరేడుచర్ల, మార్చి 11 : ఉచిత వైద్య శిబిరాలకు ఉపయోగపడే విధంగా బీపీ ఆపరేటర్, వేయింగ్ మిషన్‌ను పీఎంజీఎఫ్ లయన్ రేపాల మధన్మోహన్ మంగళవారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్‌కు అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ బట్టు మధు మదన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలి : ఎంఈఓ సలీం

హరితదళంతో ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, మార్చి 11 : విద్యార్థులు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాధికారి ఎండీ సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన జాతీయ హరితదళం సమాచార డైరీ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. హాజరైన వివిధ పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు టీ షర్టులు, క్యాపులు అందించారు. జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్, హరితదళం శిక్షకుడు ఎం. కార్తీక్, రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ ఎం. రాజశేఖర్, ఇన్‌చార్జి హెచ్ఎం మీనాక్షి, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

బాలికలను రక్షించుకోవాలి

● మహిళా సాధికారిత జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

చివ్వెంల, మార్చి 11 : బాలికలను చదివించుకొని రక్షణ కోసం మరింత జాగ్రత్త వహించాలని మహిళా సాధికారిత జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య అన్నారు. మండల పరిధిలోని వట్టిఖమ్మం పహాడ్ జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం మహిళా సాధికారిత ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావో పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, క్రాంతి, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ దీక్ష మాల ధరించడం గొప్ప వరం : నవీన్

గరిడేపల్లి, మార్చి 11 : అంబేద్కర్ దీక్ష మాల ధరించడం గొప్ప వరం అని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ్ల ధనుంజయనాయుడు, బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ సైదులు పూలె, అంబేద్కర్ ఆశయ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వాది నందిపాటి నరహరి దీక్ష మాల ధరించాడు. గ్రామ యువత ఈ సందర్భంగా ఆయన్ను కలిసి మద్దతుగా పూలమాల వేసి భారత రాజ్యాంగాన్ని అందించారు. కార్యక్రమంలో మాదిని రామ్మూర్తి, కేశవ్, రామ్ మధు, కుర్రి శివ, నందిపాటి రమేశ్, సతీశ్, నాగరాజు తదితరులున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : శ్రీకాంత్ వర్మ

పెన్‌పహాడ్, మార్చి 11 : ప్రజా సమస్యలు పరిష్క